క్లుప్తంగా

గౌరసంద్రం మారెమ్మ ఊరేగింపు



మారెమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

బొమ్మనహాళ్/బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి గ్రామంలో శుక్రవారం గౌర సంద్రం మారెమ్మ విగ్రహ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఇటీవల నూతన ఆలయాన్ని నిర్మించిన భక్తులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత రాతి విగ్రహాన్ని తీసుకువచ్చి ఊరేగింపు అనంతరం దాన్యాధివాసంలో ఉంచారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శంకరయ్య

కూడేరు: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎలక్టరోల్ రిటర్నింగ్ అధికారి) శంకరయ్య, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ వరప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం కూడేరులోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో వారు సమావేశమయ్యారు. ఫారం–6, ఫారం–7, ఫారం–8పై ఆరా తీశారు. ఎక్కడో కూర్చొని విచారణ చేస్తే, అందుకు సంబంధిత బీఎల్ఓ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎన్నికల విధులను బాధ్యతగా , నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, ఆర్ఐ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిరుతల సంచారంతో బెంబేలు

కుందుర్పి: మండలంలోని కెంచంపల్లి, కలిగొలిమి పరిసర ప్రాంతాల్లో రెండు చిరుతలు సంచరిస్తున్నట్లు పశువులకాపర్లు తిమ్మప్ప, రామాంజనేయులు, పాలయ్య తదితరులు తెలిపారు. ఆరు నెలల కాలంగా ఆయా గ్రామాల్లో నాలుగు మేకలు, రెండు లేగ దూడలు, రెండు గొర్రెలను చిరుతలు చంపినట్లు బాధిత రైతులు వాపోయారు. రాత్రిళ్లు గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పెంపుడు కుక్కలు, ఆరుబయట పాకల్లో ఉన్న పశువులపై చిరుతలు దాడి చేస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతలను బంధించాలని గ్రామీణులు కోరుతున్నారు.

అవార్డుగ్రహీతకు సన్మానం



ఉపాధ్యాయుడు బద్దేనాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: ప్రభుత్వ విశిష్ట సేవా పురస్కార గ్రహీత ఉపాధ్యాయుడు బద్దే నాయక్‌ను వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక చల్లా కాంప్లెక్స్‌లో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టు 15న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్ ఎం.గౌతమి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం గొప్ప విషయమని పలువురు అభిప్రాయపడ్డారు అనంతరం దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవ అవార్డు గ్రహీత చల్లా కిశోర్ చౌదరి, ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యాయుడు మాధవ, యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సుధీర్, తిరుమల వెంకటేశులు, సంఘం గౌరవ అధ్యక్షులు చల్లా రాజశేఖర్ చౌదరి, ఓబుళరాజు, నిర్వాహకులు స్వరూప్, రోజ్లీ రాజేష్, చైతన్య, ఎంఈఓలు తిప్పేస్వామి, శ్రీధర్, వార్డెన్ నాగరాజు, బాలా రాము, జాన్సన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఆర్డీఓ నిశాంత్ రెడ్డి

కళ్యాణదుర్గం: అవకతవకలు లేని స్పష్టమైన ఓటరు జాబితాను తయారు చేయాలని కళ్యాణదుర్గం ఆర్డీఓ నిశాంత్ రెడ్డి సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం వివిధ మండలాల ఓటరు నమోదు అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాపై ఇంటింటి వెరిఫికేషన్ పూర్తి చేశామన్నారు. సర్వేలో ఫారం–6,7,8 క్లెయిమ్‌లను జాగ్రత్తగా పరిశీలించి కార్యాలయానికి చేర్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఓటరు జాబితాలో అవతకతవకలకు పాల్పడితే, బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ ఫణికుమార్, ఎన్నికల డీటీలు వెంకటేశులు, శ్రీనాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు,బ్రహ్మసముద్రం మండలాల సహాయ ఓటరు నమోదు అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వరాల తల్లీ కరుణించు



కణేకల్లులోని దుర్గాదేవి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆలయాలతో పాటు ఇళ్లలో మహిళలు వరలక్ష్మీదేవి వ్రతాలను ఆచరించారు. మహిళలు తమ గృహాల్లో వరలక్ష్మీ ప్రతిమ ఏర్పాటుచేసి పసుపు, కుంకుమ, గాజులు, రవికలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, మహాలక్ష్మి అష్టోత్తరం, కనకధార స్తోత్రం, సామూహిక కుంకుమార్చన చేశారు. సాయంత్రం ఆలయాల్లో దేవి భజనలు, కీర్తనల ఆలాపన జరిగింది. కాగా కళ్యాణదుర్గంలోని ఇంట్లో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులను ఆహ్వానించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అలాగే బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు ఆంజినేయస్వామి, ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి, బొమ్మనహాళ్ దుర్గమ్మ దేవి, వెంకరమణస్వామి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతం పూజలు ఘనంగా చేపట్టారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ పట్టణాల్లోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.

–సాక్షి నెట్‌వర్క్:



కళ్యాణదుర్గం: వరలక్ష్మీ వ్రతం పూజలను నిర్వహిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



రాయదుర్గంలో పూజలందుకున్న మహాలక్ష్మీదేవి



రాయదుర్గం రూరల్: పూజలందుకుంటున్న బొమ్మక్కపల్లి రాజరాజేశ్వరీదేవి



బొమ్మనహాళ్: ప్రత్యేక పూజలందుకున్న వరలక్ష్మీ అమ్మవారు



గుమ్మఘట్ట: బేలోడు గ్రామంలో అలంకరణలో వరలక్ష్మీమాత



రాయదుర్గంలో నేసేపేటలోని వరలక్ష్మీదేవి ఆలయంలో సామూహిక వ్రతంలో నిమగ్నమైన మహిళలు



బెళుగుప్ప: అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



కుందుర్పి: అలంకరణలో యల్లమ్మ అమ్మవారు



కళ్యాణదుర్గం: సరస్వతీ విద్యామందిరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న దృశ్యం

మహాలక్ష్మి ఆలయంలో పూజలు



రాయదుర్గం: మహాలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న విప్ కాపు

రాయదుర్గం: వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని డి హీరేహాళ్ మండలం ఓబుళాపురం సమీపాన కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ప్రసిద్ధి చెందిన మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి కిటకిటలాడింది. ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో మహిళలు తరలి వచ్చి అమ్మసేవలో తరించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి క్యూలైన్‌లో వెళ్లి దర్శనం పొందారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గడేహోతూరు ఘటనపై విచారణ

ఉరవకొండ: వజ్రకరూర్ మండలం గడేహోతూరుకు చెందిన వైకేపీ ఆనిమోటర్, ఆమె భర్త చేతివాటం ప్రదర్శించి మహిళా సంఘాల డబ్బు స్వాహా చేసిన ఘటనపై ఈనెల 24న సాక్షి దినపత్రికలో గడేహోతూరులో ఘరానా మోసం అన్న శీర్షికతో ప్రచురితమైన కథనంపై వైకేపీ ఏపీడీ ఈశ్వరయ్య శుక్రవారం విచారణ చేపట్టారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో బాధ్యులైన యానిమేటర్ మహలక్ష్మి, అతని భర్త లాలుస్వామితో పాటు సీసీ రామాంజినేయులను అధికారులు విచారించారు. ఉరవకొండ స్టేట్‌బ్యాంకుతో పాటు వైకేపీ కార్యాలయానికి వెళ్లి రికార్డులు పరిశీలించిన అనంతరం పూర్తిస్థాయిలో నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఈ ఘటనలో సీసీ రామాంజనేయులు సంతకం సైతం ఫోర్జరీ చేసినట్లు గుర్తించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యుల పై క్రిమినల్ కేసులు సైతం నమోదు చేయిస్తామన్నారు.

నారా లోకేష్‌పై ఫిర్యాదు



ఎస్ఐ దుగ్గిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ ఉదయ్‌కుమార్

కణేకల్లు: పాదయాత్రలో రెచ్చగొట్టేలా వ్యాఖ్యాలు చేస్తున్న నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని రాయదుర్గం తాలుకా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ ఉదయ్‌కుమార్ తదితరులు శుక్రవారం కణేకల్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2019 నుంచి 2024 వరకూ ఎవరి మీద ఎక్కువ కేసులు నమోదైతే, అలాంటి వారికి టీడీపీ ప్రభుత్వం రాగానే నామినేటెడ్ పోస్టులు ఇస్తామంటూ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా నారా లోకేష్ వ్యాఖ్యాలు చేస్తున్నారంటూ ఆయనతోపాటు మండల, రూరల్ ప్రాంతం సోషల్ మీడియా కన్వీనర్లు హంపీ, లోకేష్‌రెడ్డి, జీలాన్, ప్రతాప్ అన్నారు. లోకేష్‌తోపాటు చంద్రబాబు నాయుడు, అచ్చెంనాయుడు కూడా రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా మాట్లాడుతున్నారన్నారు. గొడవలు, అల్లర్లు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని టీడీపీ కుట్రలు, కుయుక్తులు పన్నుతోందని మండిపడ్డారు. రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఐకి ఫిర్యాదు చేశారు.

పేదలకు అండగా 'వైఎస్సార్ బీమా'



నగదు అందజేస్తున్న కాపు భారతి, కౌన్సిల్ సభ్యులు

రాయదుర్గంటౌన్: వైఎస్సార్ బీమా పథకం పేదలకు అండగా ఉంటోందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. పట్టణంలోని 30వ వార్డు శాంతినగర్‌లో కొత్తపల్లి శ్రీనివాసులు(38) గుండెపోటుతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు తక్షణ ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, వార్డు ఇన్‌చార్జ్ గోరంట్ల సత్యనారాయణతో కలిసి కాపు భారతి అందజేశారు. ధైర్యంగా ఉండాలని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. బీమా కింద మిగతా రూ.90 వేలు నామినీ ఖాతాకు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పోరాళ్ల గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, పెద్ద వన్నూరుస్వామి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు అరవ శివప్ప, కృష్ణమూర్తి, ఓబు, పవన్‌కుమార్ తదితదిరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మొక్కల పెంపకానికి శ్రీకారం

కుందుర్పి: జంబుగుంపల పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల రహదారులకు ఇరువైపులా 3,500 మొక్కలు పెంచుతున్నట్లు ఆర్డీటీ ఎకాలజీ డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కొలిమిపాళ్యం –కలిగొలిమి రహదారిలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో 12 కిలోమీటర్ల మేర చింత, కానుగ, నేరేడు, ఉసిరి, వేప మొక్కలను నాటడడంతోపాటు మూడేళ్ల పాటు మొక్కల సంరక్షణకు ఆర్డీటీ రూ.42లక్షలు నిధులు విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు రామాంజినేయులు, వెంకటేశులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలకు రక్షణ తడులు

బెళుగుప్ప: వర్షాభావంతో ఎండుతున్న పంటలకు రక్షక తడులు అందించగలిగితే కొంత వరకు పంట చేతికి వచ్చే అవకాశముంటుందని ఏఎఫ్ ఎకాలజీ ఎంటీఎల్ ఓబుళపతి అన్నారు. మండలంలోని ఆవులెన్న, వెంకటాద్రిపల్లి తదితర గ్రామాల్లో ఏఎఫ్ ఎకాలజీ ఎంటీఎల్ మండల ఏఓ పృథ్వీసాగర్‌ను కలసి నీటితడులకు అవసరమైన రైన్ గన్‌లను సమకూర్చుకుని ఆముదం పంటకు రక్షక తడులు అందిస్తున్నారు. కార్యక్రమంలో సీబీఓ తిప్పేస్వామి, ఎకాలజీ విభాగం సభ్యులు క్రిష్టా, వెంకటేశులు, సుబ్బన్న, నాగరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం అన్యాక్రాంతం కానీయొద్దు

కణేకల్లు: మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామశివారులో ఉన్న ముస్లిం శ్మశాన వాటికను అన్యాక్రాంతం కాకుండా చూడాలని ముస్లింలు శుక్రవారం తహసీల్దార్ రజాక్‌వలికి విజ్ఞప్తి చేశారు. బాధితుల కథనం మేరకు... శ్మశాన వాటిక పక్కనే పంట కాలువ ఉంది. పంట కాలువ అటువైపు ఇళ్లున్నాయి. ఆ ఇళ్ల యజమానులు కాలువ వైపు స్థలాన్ని ఆక్రమిస్తూ రావడంతో.. రైతులు శ్మశాన స్థలంలో కాలువను తీస్తున్నారని వైస్ సర్పంచు బాషా, ముస్లిం మత పెద్దలు దాదావలీ, వలీ, మహమ్మద్, రెహిమన్, వన్నూరుసాబ్, దాదాఖలందర్, షాక్షావలి తదితరులు తెలిపారు. స్థలాన్ని సర్వే చేసి న్యాయం చేస్తామని ఆయన హామీచ్చారు.


వరుణ దేవుడి కోసం ప్రార్థన

రాయదుర్గం రూరల్: వరుణుడి కరుణ కోసం మండలంలోని జుంజురాంపల్లికి చెందిన ముస్లింలు శుక్రవారం పొలాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేల రూపాయలు ఖర్చు చేసి పంటలు సాగు చేశామని, వరుణుడు ముఖం చాటేయడంతో నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. ముతవల్లి మహబూబ్ పీరా, మౌజన్ హుసేన్ , మాల్యం మహమ్మద్, మాల్యం ఇస్మాయిల్, ఫతాన్ ఖాజాపీరా , చికెన్ జిలాని, మాల్యం మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

కళ్యాణదుర్గం: ప్రమాదవశాత్తు మృతి చెందిన వానరం (కోతి)కి గ్రామస్తులు అంత్యక్రియలు చేశారు. మండలంలోని దాసంపల్లిలో శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒక వానరం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచు గంగన్న, గ్రామస్తులు నారాయణరెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు వానరానికి హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు జరిపారు. గ్రామస్తులు వెంకటేష్, రవి, హనుమంతప్ప, సన్న తిమ్మప్ప, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలకు రాకపోతే ఎలా?



మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రమ్మ

ఉరవకొండ: మూడు నెలలకొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు రాకుంటే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, సభ్యులు మండిపడ్డారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరవడంతో వారు మండిపడ్డారు. అధికారులు సమావేశాలకు రాకపోవడాన్ని నిరసిస్తూ కోఆప్షన్ సభ్యులు పామిడిసలీం సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లారు. అనంతరం జరిగిన సమావేశంలో తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫామీదాను సభ్యులు నిలదీశారు. పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. జేఈ మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి పథకం కార్మికులు సమ్మెలో ఉండటం వల్ల తాగునీరు పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదన్నారు. జేజేఎం ద్వారా పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. ఎంపీడీఓ అమృతరాజ్ మాట్లాడుతూ సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా జగన్ పాలన



మాట్లాడుతున్న విప్ కాపు. (చిత్రంలో) జిల్లా అధ్యక్షుడు పైలా, నదీంఅహ్మద్



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- ఘనంగా ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవం

రాయదుర్గం: పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. డి హీరేహాళ్ మండలంలోని మలపనగుడి లో శుక్రవారం గ్రామ సచివాలయం , రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, సర్పంచ్ రుద్రేష్, ఎంపీపీ ఎం .పవిత్ర, జెడ్పీటీసీలు హసీనాబాను, పీఎస్ మహేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఎం. వన్నూర్‌స్వామి, కాంట్రాక్టర్ సత్యనారాయణరెడ్డి, పీఆర్ డీఈ రామమోహన్‌రెడ్డి, ఏడీఏ లక్ష్మానాయక్‌తో కలసి విప్ ప్రారంభించారు. విప్ మాట్లాడుతూ గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేసే దిశగా సీఎం జగన్ వేసిన అడుగులు సత్ఫలితానిస్తోందన్నారు. జిల్లాలోనే అత్యంత మారుమూల గ్రామమైన మలపనగుడి లో రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాడ్డాయంటే అది సీఎం జగన్ చలువేనన్నారు.

బాబు 420 అయితే కాలవ 840

అపద్దాల్లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు 420 అయితే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు అంతకు రెట్టింపు 840 అని విప్ కాపు మండిపడ్డారు. విలువల్లేని రాజకీయాలకు ఈ ఇద్దరు కేరాఫ్‌గా చెప్పుకోవచ్చని ధ్వజమెత్తారు. 2014 ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని 610 తప్పుడు హామీలిచ్చి అన్నీ వర్గాలను మోసం చేసిన ద్రోహి బాబు అయితే, 2019 ఎన్నికల నోటిఫికేషన్ మధ్యాహ్నం 3 గంటలకు విడుదలైతే ఉదయం 11 గంటలకు ఓబుళాపురంలో రూ.200 కోట్లతో తాగునీటి పథకానికి శంఖుస్థాపన చేసి ప్రజలందరినీ నిలువు దగాకు గురిచేసిన మాయగాడు కాలవ అని విరుచుపడ్డారు. మలపనగుడి గ్రామంలో ఈ నాలుగేళ్లలో రూ.28 కోట్లతో అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేశామన్నారు. కాలవ హయాంలో ఎంత వెచ్చించారో లెక్కలతో చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్రానికి సీఎం గా జగన్ ఉన్నంత వరకే సంక్షేమ పథకాలు అందుతాయనే విషయం ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలన్నారు.

గొప్ప విజన్ కలిగిన వ్యక్తి సీఎం జగన్

రాజకీయాల్లో గొప్ప విజన్ కలిగిన వ్యక్తి సీఎం జగన్ మాత్రమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి జగన్ లా ఇంత వరకు ఏ నాయకుడు పాటుపడలేదన్నారు. మాజీ మంత్రి కాలవ రూ.వందల కోట్లు దోచేసి అభివృద్ధిని విస్మరించాడన్నారు. చంద్రబాబు, కాలవ మాటలను ఏ ఒక్కరు నమ్మవద్దన్నారు. అనంతరం నదీంహమ్మద్ మాట్లాడారు.. మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్ చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. మంచిచేసే ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రానాథ్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు పథకాలిస్తే ప్రతిపక్షాలకు కడుపుమంట

డి హీరేహాళ్(రాయదుర్గం): పేదలకు పథకాలిస్తుంటే ప్రతిపక్షాలకు ఎందుకంత కడుపుమంట అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. మంచిచేస్తుంటే చూస్తూ ఓర్వలేకపోతున్నారని విరుచుకుపడ్డారు. డి హీరేహాళ్ మండలంలోని మలపనగుడి, సిద్ధాపురం గ్రామాల్లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రుద్రేష్, ఎంపీపీ ఎం.పవిత్ర, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, జెడ్పీటీసీ హసీనబాను, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, కాంట్రాక్టర్ సత్యనారాయణరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ తొండ వెంకటేశులుతో కలసి విప్ గడప గడపకూ వెళ్లి ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన వివరాలతో కూడిన సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించారు. మంచిచేసే ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని విప్ అభ్యర్థించారు. ఈ సందర్భంగా విప్ కాపు విలేకర్లతో మాట్లాడారు.. నవరత్న పథకాల అమలుతో గడప గడపలోనూ ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ డీబీటీ ద్వారా రూ.1.65 లక్షల కోట్లను నేరుగా పేదల ఖాతాలకు చేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. మలపనగుడి, సిద్ధాపురం అభివృద్ధి కి ఈ నాలుగేళ్లల్లో రూ.28 కోట్లు ఖర్చుచేశామన్నారు. వచ్చే నెలాఖరులోగా రూ.41 కోట్లతో 39 గ్రామాలకు శ్రీరామిరెడ్డి తాగునీరందిస్తామన్నారు.

మోసకారి చంద్రబాబు

టీడీపీ అధినేత చంద్రబాబు లాంటి మోసకారి ప్రపంచ దేశాల్లోనే మరొకరు ఉండలేరని విప్ ధ్వజమెత్తారు. మూడుపూటల కడుపునిండా అన్నం తినే జగన్ పాలన కావాలా..? అనుక్షణం ఆకలి చావుతో కొట్టుమిట్టాడే చంద్రబాబు లాంటి రాక్షస పాలన కావాలో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారధ్విక టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు వారానికో డబ్బా సెల్ఫీ పెట్టి ప్రజలను మభ్యపెడుతున్నాడని విప్ మండిపడ్డారు. పూర్తి కాని పనులకు కాలవ సెల్ఫీలు పెడితే.. పూర్తయిన పనులకు టెంకాయ కొట్టి ప్రారంభించే పనులు తాము చేస్తున్నామని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాస్కర్‌బాబు, తహసీల్దార్ ఈశ్వర్‌రెడ్డి, డీటీ బసవకుమార్, గుమ్మఘట్ట జెడ్పీటీసీ పీఎస్ మహేష్, వైస్ ఎంపీపీ లింగప్ప, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచులు మల్లికార్జున, కోట్ల ఉమేష్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, పరమేష్, హెచ్ లక్ష్మీ, పార్టీ నాయకులు రహంతుల్లా, కల్యం సురేష్, సింగాడి జగదీష్, సింగాడి మంజు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గొప్ప పోరాటయోధుడు గద్దర్



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

కళ్యాణదుర్గం: గొప్ప పోరాట యోధుడు గద్దర్ అని మహాబోధి వ్యవస్థాపకుడు కృష్ణమూర్తి అన్నారు. స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో శుక్రవారం స్ఫూర్తి పౌండేషన్ వ్యవస్థాపకుడు నరసింహులు ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎన్నో ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసి తన పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు. విప్లవ పంథాలో ప్రజలను జాగృతి చేయడంలో గద్దర్ చూపిన చొరవ మరువలేనిదన్నారు. అనంతరం ప్రజా గాయకుడు దాసరి ఆదినారాయణ గద్దర్ విప్లవ గీతాలను ఆలపించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేశులు, తెలుగు ఉపాధ్యాయులు ఆదిఆంధ్ర తిప్పేస్వామి, విశ్రాంత ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి గద్దర్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మల్లికార్జునగౌడ్, రిటైర్డ్ అధ్యాపకుడు మల్లికార్జున, వినియోగదారుల సంఘం నాయకులు చల్లా కిశోర్ చౌదరి, విజయ్, దుర్గం రక్తదాతల ఫౌండర్ కంబాల తిమ్మారెడ్డి, హేమావతి రాజన్న, రవి, ఎంఎస్ రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాల్లో జాగ్రత్తలు పాటించండి

కళ్యాణదుర్గం/కంబదూరు: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పంటకోత ప్రయోగాల్లో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీ యల్లప్ప సూచించారు. స్థానిక ఆర్‌బీకేలో శుక్రవారం సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై అవగాహన కల్పించారు. పంట కోత ప్రయోగాలు ఎలా చేయాలి...పంట శాతాన్ని ఎలా లెక్కించాలి..? అన్న విషయాలపై డీవైఎస్ఓ హనుమన్న వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ ఆదినారాయణరెడ్డి, ఏఈఓ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఈ–క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని కంబూరు తహసీల్దార్ నయాజ్ అమ్మద్, ఏఓ జాఫర్ సూచించారు. పంటకోత పంటకోత ప్రయోగాలమీద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఉరవకొండ: స్థానిక గవిమఠం ప్రాంగణంలో కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి ఎస్ఐ వెంకటస్వామి, పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ సూచన మేరకు ఉరవకొండ ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు వేల్పుల మురళి, నూర్‌బాషా, భీమేష్, అశోక్, రమేష్, నవీన్, పోలీసు సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.